

# పుస్తక పరిచయం




K.P. Ashok Kumar
6, Maa Santhoshi Colony
Turkapally Road
Bollaram
Secunderabad - 500 010.
Cell : 97000 00948
e-mail: ashok.0940@gmail.com

**తెలుగు సాహిత్యానికి** కె.పి.అశోక్ కుమార్‌గారు చేసిన, చేస్తున్న సేవ నిరుపమానమైనది. ఇంతకు ముందు పుస్తక సమీక్షల్లో వారు వ్రాసిన కొన్ని విలక్షణమైన పుస్తకాలను పరిచయం చేయడం జరిగింది. వృత్తి రీత్యా లైబ్రేరియన్ గా అశోక్ కుమార్ గారు, సినిమా, లైబ్రరీ సైన్సు, చరిత్ర, వైజ్ఞానిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక శాస్త్రాలకు చెందిన పుస్తకాలను విస్తృతంగా చదివారు విశ్లేషించారు.. విస్తృత పఠనం, విశ్లేషణ, పరిశీలన - అశోక్ కుమార్‌గారితో అనేక అంశాలగురించిన పలు విమర్శనా వ్యాసాలు వ్రాయడానికి కారణాలయ్యాయి. తెలుగులో కథా సాహిత్యానికున్న పెద్దపీటను ఎవరూ కాదనలేరు. ఐతే కథ విమర్శ అనే ప్రక్రియ తెలుగులో సాపేక్షంగా చూస్తే చాలా తక్కువే అని చెప్పుకోవచ్చు. తెలుగులో కవితా విమర్శతో వచ్చిన పుస్తకాల కంటే కథా విమర్శతో వచ్చిన పుస్తకాలు చాలా తక్కువ అని చెప్పుకోవచ్చు. ఒకవేళ కథా విమర్శలు వచ్చినా ఎక్కువగా అవి ప్రసిద్ధ రచయితల కథల గురించే ఐ ఉంటాయి. రచయిత ప్రాచుర్యంతో సంబంధం లేకుండా పలు కథా రచయితల కథల గురించి వివిధ సందర్భాల్లో, వివిధ పత్రికల్లో కె.పి. అశోక్ కుమార్‌గారు వ్రాసిన వ్యాసాల సంపుటి ఈ కథావిష్కరణ పుస్తకం. 200 పేజీల ఈ పుస్తకంలో 14 వ్యాసాలు ఉన్నాయి. మొట్టమొదటి వ్యాసమైన "తెలంగాణ కథల్లో ప్రతిఫలించే సామాజిక - సాంస్కృతిక పరివర్తనలు " అనే వ్యాసం తప్ప మిగతా వ్యాసాలన్నీ ఒక్కో రచయిత కథల గురించిన సమగ్రమైన విశ్లేషణా వ్యాసాలు. ఈ కథా రచయితల్లో కొంతమంది: యం.రామకోటి, పోరంకి దక్షిణామూర్తి, కొనకళ్ళ వెంకటరత్నం, అంబళ్ళ జనార్ధన్, శశిశ్రీ, పాలకోడేటి మొదలైనవారు. ఓ వ్యాసాలన్నీ చదివితే కొన్ని వందల కథలు చదివిన అనుభూతి కలుగుతుంది. ప్రతి కథనూ సరళమైన భాషలో క్లుప్తంగా తెలియచేసిన విధానం పాఠకులని ఆకట్టుకుంటుంది. ఏదో విమర్శనా వ్యాసాన్ని చదువుతున్న అనుభూతిని కాక నిజంగా మూల కథలనే చదువుతున్న భావాన్ని కలగచేస్తుంది, రచయిత శైలి. విస్తృత కథకుడు కొనకళ్ళ వెంకటరత్నం వ్యాసంలో ఆయన వ్రాసిన మంచికథలను ప్రశంసిస్తూనే ఆయన వ్రాసిన కొన్ని కథలను ప్రస్తావిస్తూ "చౌకబారు ధోరణులతో ఉన్న ఈ నాలుగు కథలూ రచయితపై ఉన్న మంచి అభిప్రాయాన్ని పోగొట్టడానికి తోడ్పడతాయి" అని నిర్మొహమాటంగా చెప్పడం, విశ్లేషకుడిగా అశోక కుమార్ గారి నిజాయితీకి నిదర్శనం. మూలకథలంత ఆసక్తికరంగా విమర్శనా వ్యాసాలను అందించిన అశోక్ కుమార్ గారి శ్రమ సదా అభినందనీయం.

***




ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియూ సంస్కృతి సమితి
ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత నృత్య కళాశాల
దుర్గాపురం, విజయవాడ-8
ఫోన్: 96188 48470

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA

**గుంటూరులో** ప్రముఖ వైద్యులు, సాహితీప్రియులూ డా.రమణ యశస్విగారు వ్రాసిన సరికొత్త సాహితీప్రక్రియా సంపుటి ఈ 'భలే మంచిరోజు'. లిమరిక్కులు, ఋక్కులు కోవలో న్యూమరిక్కులు అనే వినూత్న సాహితీప్రక్రియకు నాంది పలికారు డా.రమణగారు. వారి మాటల్లోనే చెప్పాలంటే "నేను వార్తలను(న్యూస్) ఇంగ్లీష్ లిమరిక్కులను కలిపి న్యూమరిక్కులుగా రాశాను. ఇది నేనే కనిపెట్టి నేనే ప్రారంభించిన కొత్త ప్రక్రియ. ఈ ప్రక్రియలో 5 పాదాలుంటాయి. ఒకటి, రెండు పాదాలు మరియు ఐదో పాదం ఒక అంత్యప్రాసతో ఉంటాయి. మధ్యలో మూడు, నాలుగు పాదాలు మరొక అంత్యప్రాసతో ఉంటాయి". ఈ ప్రయోగంలో రచయిత ఒక సంవత్సరంపాటు వచ్చే ప్రత్యేకమైన రోజులను తీసుకొని వాటిని ఐదుపాదాల న్యూమరిక్కులలో ఇమిడ్చారు. ఇలాంటి ప్రయత్నం చేయడానికి కవితాసక్తి, భావుకతతో పాటు ప్రతిరోజు ప్రత్యేకత తెలుసుకోడానికి కొంత పరిశోధన, మరికొంత అధ్యయనం అవసరం. రెంటినీ సమపాళ్ళలో సాధించి తనకున్న సహజసిద్ధమైన కవితాహృదయంతో ఈ న్యూమరిక్కులను తమదైన శైలిలో తీర్చిదిద్దారు. ఇందులోని కొన్ని న్యూమరిక్కులను పరిశీలిద్దాం. సంవత్సరంలో మొదటిరోజు జనవరి 1. రోజుప్రత్యేకతను ఇలా వ్యక్తీకరించారు డా.రమణగారు "కోటి కాంతుల కొంగొత్త ఆంగ్ల ఏడాది / మరొక మూస వత్సరం కాకూడదది / ఆశల ఊయలలో వచ్చే జనవరి ఒకటి / కోరికల ఐరావతానికి కాలమే మావటి / సరికొత్త ప్రణాళికల విజయసోపానమది" . కోరికలను ఐరావతంతోనూ, కాలాన్ని మావటితోనూ పోల్చడం మంచి ప్రయోగం చేశారు రచయిత. జనవరి 14, మహాశ్వేతాదేవి జననం. ఆ సందర్భాన్ని ఇలా వ్రాశారు " తాను మరణిస్తే మహువా చెట్టు నాటమంది / మె 'దాయెన్' ఆధారంగా మాటీమాయ్ రూపొందింది / జనవరి 14 ఆదివాసీ మహాశ్వేతాదేవి జననం / అరణ్య అధికార్ - అకాడెమి అవార్డు రచనం / ఈ కలంకారిణి 1996లో జ్ఞానపీఠ్ అవార్డు అందుకుంది" - ఈ న్యూమరిక్కులో రచనం, కలంకారిణి - కొత్త ప్రయోగాలు. అలానే అంత్యప్రాసను గౌరవించడానికి ఒక పాదం మామూలు వాక్యంగా అనిపించినా న్యూమరిక్కును కొనసాగించడం రచయిత నిబద్ధతకు నిదర్శనం. మార్చి 14, 'పై' దినోత్సవం గురించి ఇలా వ్రాశారు " 'పై' 22/7 విలువ 3.4159గా లెక్కగట్టారు / 1988 లో 'లారీ షా' మొదట జరిపారు / మార్చి పద్నాలుగు 'పై' దినోత్సవం / గణిత శాస్త్రాభిమానుల - ఆనందోత్సవం / 'పై' గణిత స్థిరాంకాల్లో కరణీయ సంఖ్య మాస్టారు! " మొదటి రెండు వాక్యాల్లోని సంఖ్యలు పాదాల్లోని లయను దెబ్బతీసినా అంత్యప్రాసకే కట్టుబడడమనేది న్యూమరిక్కుల నిర్వచనానికి డా.రమణగారుగారు ఇచ్చిన గౌరవం అనిచెప్పుకోవచ్చు. 'కరణీయ సంఖ్య' అనే గణితశాస్త్ర పారిభాషిక పదాన్ని వాడడం కూడా న్యూమరిక్కుకు అందాన్నిచ్చింది. వందలాదిగా ఉన్న ఈ న్యూమరిక్కుల రచనకూ, సమాచార సేకరణకూ డా.రమణగారు చేసిన కృషి ఈ సంపుటిలో ప్రతి అక్షరంలోనూ కనిపిస్తుంది. ఈ సరికొత్త ప్రయోగాన్ని తెలుగు కవితాభిమానులంతా చదివి ఆనందించగలరని ఆశిద్దాం.

★★★